ప్రజాశక్తి
శుక్రవారం 29 మార్చి 2024 | 5 | శ్రీ సత్యసాయి



'సేవ్ ఎనర్జీ-సేవ్ ఎన్విరాన్‌మెంట్'పై అవగాహన



'సేవ్ ఎనర్జీ-సేవ్ ఎన్విరాన్‌మెంట్'పై అవగాహన ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.మరవపల్లిలో ఉన్న మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాల విద్యార్థులు గురువారం 'సేవ్ ఎనర్జీ-సేవ్ ఎన్విరాన్‌మెంట్'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు బ్యానర్ ప్రదర్శిస్తూ 'సేవ్ పెట్రోల్, సేవ్ డీజిల్, సేవ్ విద్యుత్' అంటూ నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, రామకృష్ణ, ప్రభాకర్, మూర్తి, నరేష్, హనుమంత రాయుడు, అశ్వర్థనారాయణ, గీత, స్వాతి, శ్రీవిద్య, మంజుల పాల్గొన్నారు.

పండ్లతోటల రైతులకూ కష్టాలే..!

వర్షాభావంతో ఖరీఫ్, రబీ సీజన్లలో వరుసగా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఉన్నపాటి నీటి వనరులతో బోరుబావుల కింద పండ్ల తోటల సాగుపై దృష్టి సారించారు. ఈ పండ్ల తోటలు కూడా రైతులకు నష్టాలనే మిగులుస్తున్నాయి. అరటి, చీనీ, మామిడి, సపోటా తదితర పంటలు ఏదో రూపంలో నష్టాన్ని తెచ్చిపెడుతూ రైతులను అప్పుల్లోకి నెట్టేస్తున్నాయి.



నామనాంకపల్లిలో తెగుళ్లు సోకిన చీనీచెట్లను తొలగించిన రైతు

- 'చీనీ'కి తెగుళ్ల పోటు..!
- అరటికి నీటి కరువు
- ఎండిపోతున్న చెట్లు
- కాత వచ్చే సమయంలో రైతుకు కష్టం
- నామనాంకపల్లిలో చీనీ, నాగిరెడ్డిపల్లిలో అరటి చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పెద్దపప్పూరు మండల వ్యాప్తంగా చాలా మంది రైతులు చీనీ చెట్లను సాగు చేశారు. కంటికి రెప్పలా చెట్లను కాపాడుకుంటూ వచ్చారు. ఇక్కడ కూడా రైతులకు నష్టాలు తప్పలేదు. పంట కాయలు కాసే సమయానికి చీనీ చెట్లు తెగుళ్ల బారిన పడి ఎండిపోతున్నాయి. చేసేది లేక రైతులు చెట్లను నరికివేస్తున్నారు. పండ్లతోటల సాగు నిమిత్తం ఖర్చు చేసిన లక్షలాది రూపాయలను రైతులు నష్టపోతున్నారు. పెద్దపప్పూరు మండల పరిధిలోని నామనాంకపల్లిలో రైతులు చీనీ చెట్లను సాగు చేశారు. దాదాపు పది సంవత్సరాల పాటు వాటిని కాపాడుకున్నారు. ఈ ఏడాది ప్రస్తుతం చెట్లు కాపుకు వచ్చాయి. ఇదే సమయంలో చెట్లకు వేరుకుళ్లు తెగుళ్ల సోకాయి. దీంతో చెట్లు ఆకులు రాలి మొత్తం ఎండిపోయాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా చెట్లు బతక్కపోవడంతో చేసేది లేక రైతులు వాటిని తొలగించేస్తున్నారు. ఇలా నామనాంకపల్లి గ్రామంలో రైతు కులశేఖర్‌రెడ్డి ఎనిమిది సంవత్సరాల వయస్సున్న 400 చెట్లను తొలగించేశాడు. ఈ ఒక్క రైతుకే దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో ఇదేరకమైన తెగుళ్లతో పండ్ల తోటలు ఎండిపోతున్నట్లు తెలుస్తోంది.

కళ్లెదుటే చెట్లు ఎండిపోయాయి...

ఉన్న కొద్దిపాటి నీటి వసతితో తనకున్న నాలుగు ఎకరాల్లో చీనీ చెట్లను సాగు చేశాను. ఎనిమిది సంవత్సరాలుగా కంటికి రెప్పలా వాటిని కాపాడుకున్నాను. నెల రోజుల క్రితం వరకు చెట్లు బాగానే ఉన్నాయి. ఉన్నట్లుండి ఆకులు రాలడం మొదలయ్యాయి. దీని కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు చల్లాను. అయినా ప్రయోజనం లేదు. చివరకు తెగుళ్ల దెబ్బకు చెట్లు మొత్తం ఎండిపోయాయి. చేసేది లేక 400 చెట్లను తొలగించేశాను.

కులశేఖర్‌రెడ్డి, రైతు, నామనాంకపల్లి.

భూమి సారవంతం తగ్గడం వల్లే..

ఎక్కువగా కాంప్లెక్స్ ఎరువులు వేయడం వల్ల భూమి సారవంతం కోల్పోతుంది. దీని వల్ల వేర్లకు తెగుళ్ళు సోకుతాయి. వేర్లకు తెగుళ్లు సోకితే చెట్లు ఎండిపోతాయి. రైతులు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించాలి. తద్వారా భూమి సారవంతం అయ్యి ఎండు తెగుళ్లు తగ్గిపోతాయి.

ఉమాదేవి, ఉద్యానవన అధికారి.

నీరులేక.. ఎండిన అరటితోట..!



పుట్లూరు మండలం నాగిరెడ్డిపల్లిలో నీరు లేక ఎండిపోవడంతో ట్రాక్టర్‌తో దున్నేసిన అరటి పంట



రైతు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు


గత సంవత్సరం నుంచి వర్షాలు లేకపోవడంతో బోరుబావుల్లో నీరు పాతాళానికి చేరింది. దీనికి తోడు హెచ్‌ఎల్‌సి నీటిని కూడా విడుదల చేయకపోవడంతో పండ్ల తోటల రైతులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. బోరుబావుల్లో నీరు అడుగంటడంతో పంటలను కాపాడుకోవడం అన్నదాతకు శక్తికి మించిన పనిగా మారింది. అప్పులు చేసి దాదాపు 1500 అడుగుల మేర బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు బయటికి రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చేసేది లేక రైతులు పండ్ల తోటలను తొలగించేస్తున్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి తనకున్న మూడున్నర ఎకరాల పొలంలో గత నాలుగు నెలల క్రితం అరటి పంటను సాగు చేశాడు. చెట్లు పెరుగుతున్న క్రమంలో భూగర్భ జలాలు అడిగంటిపోయాయి. బోర్లను నుంచి ఒక చుక్క కూడా నీరు రాకపోవడంతో చెట్లకు తడిలేక ఎండుదశకు చేరుకున్నాయి. నీటి వసతి లేనికారణంగా నాలుగు నెలల పాటు ఎంతో కష్టపడి పెంచిన అరటిమొక్కలను కాపాడుకోవడం కష్టం అని భావించి గురువారం నాడు ట్రాక్టర్ తొలగించేశాడు. దీంతో రైతుకు సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లింది. పండ్ల తోటలు ఆదుకుంటాయని సాగు చేస్తే అవి కూడా నష్టాన్ని మిగిల్చాయంటూ రైతు రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు.



రాప్తాడులో ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

- చంద్రబాబు పర్యటనలో తమ్ముళ్ల జోరు
- రాష్ట్రాన్ని నాశనం చేశారంటూ జగన్‌పై విమర్శలు
- స్థానిక ఎమ్మెల్యేల అవినీతిని ఎండగడుతూ ప్రసంగం
- విభేదాలు వీడి గెలుపునకు పని చేయాలని తమ్ముళ్లకు ఉద్బోధ

టిడిపిలో జోష్



బుక్కరాయసముద్రంలో టిడిపి నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరువాత జరిపిన టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తొలి పర్యటన తమ్ముళ్లలో జోష్ నింపింది. ఒకేరోజు మూడు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. మదనపల్లి నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో అనంతపురం విచ్చేసిన ఆయన ఉదయం రాప్తాడు బహిరంగ సభలో పాల్గొన్నారు. అక్కడ బిసిల గురించి ఎక్కువ ప్రస్తావిస్తూ ప్రభుత్వం, వైసిపి తీరుపై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై ఆరోపణలు చేయడంతోపాటు తాము అధికారంలోకి వస్తే విచారణ చేపడతామని హెచ్చరికలు జారీ చేశారు. ఇసుక మొదలుకుని అన్నింటినీ దోచేసారని మండిపడ్డారు. బిసిలకు వైసిపి పాలనలో రక్షణ లేకుండాపోయిందని విమర్శించారు. ఈ సభకు నియోజకవర్గంలోని వేలాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సభ అనంతరం మధ్యాహ్నం ఆర్డీటీ అతిథి గృహంలో బస చేశారు. తదనంతరం మధ్యాహ్నం నుంచి బుక్కరాయసముద్రంలో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ సభకు టిడిపి అభ్యర్థి బండారు శ్రావణితోపాటు అసంతృప్త నేతలుగానున్న ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి ముగ్గురూ పాల్గొన్నారు. ఈ సభలో చంద్రబాబు దళితుల సమస్యలను ఎక్కువగా ప్రస్తావించారు. వైసిపి పాలనలో దళితులకు రక్షణ లేకుండాపోయిందని విమర్శించారు. వైసిపిలో శింగనమల టిక్కెట్టు తన దగ్గర పనిచేసే ఉద్యోగికి ఇప్పించి అధికారాన్ని తన చేతుల్లో పెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వైసిపి ఎమ్మెల్యే నియోజకవర్గం పరిధిలో చేసిన అవినీతి అక్రమాలను ఎండగట్టారు. శింగనమల నియోజకవర్గం ఉద్యానవన పంటలకు ప్రసిద్ధి అని, సాగునీటి వసతి కల్పిస్తే బంగారం పండిస్తారని తెలిపారు. వైసిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసారని విమర్శించారు. దళితులకు రక్షణగా టిడిపి ఉంటుందని హమీలిచ్చారు. కదిరిలో ముస్లిం మైనార్టీలతో సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇలా బీసీ, ఎస్సీ ,మైనార్టీలను ఆకట్టుకునేలా చంద్రబాబు నాయుడు పర్యటనను కొనసాగించారు. వైసిపి హయంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యనికి గురయ్యాని విమర్శించారు. అనంతపురం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను చేపట్టకుండా మోసం చేసారని మండిపడ్డారు. పరిశ్రమలు ఒక్కటీ రాలేదని, వచ్చిన జాకీ పరిశ్రమను పారిపోయేటట్టు చేసారని దుయ్యబట్టారు. స్థానిక సమస్యలను ప్రస్తావించడంతోపాటు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున అందరూ ఏకతాటిపైకొచ్చి వైసిపిని ఇంటికి పంపించే కార్యక్రమాన్ని గట్టిగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మొత్తంగా గురువారం జరిగిన టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పర్యటన పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఎన్నికలకు సమాయత్తం అయ్యే విధంగా ఉత్సాహాన్ని నింపిందనే చెప్పాలి. ఈ కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు బండారు శ్రావణి, పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, కాలవ శ్రీనివాసులు, బికె.పార్థసారధి, పరిటాల శ్రీరామ్‌తో పాటు ఉమ్మడి జిల్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్డీఏలో చేరాం



కదిరిలో ముస్లిములతో కలిసి ప్రార్థనలు చేస్తున్న చంద్రబాబు నాయుడు

కదిరి అర్బన్ : రాష్ట్ర ప్రయోజనాలు, పిల్లల భవిష్యత్తు కోసమే ఎన్డీఏలో చేరామని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. ప్రజాగళం పర్యటనలో భాగంగా కదిరి పట్టణంలోని ఎస్‌టిఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిములకు మిఠాయిలు తినిపించి దీక్షలను విరమింపజేశారు. అనంతరం సామూహిక ప్రార్థనలో చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను ఉద్దేశించి మాట్లాడారు. 2004 నుంచి 2019 వరకు మైనార్టీల హక్కులను కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ ఎనలేని కృషి చేసిందన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు ఏ ప్రభుత్వాలూ అందించని విధంగా రంజాన్ తోఫా అందించామని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకున్న విషయంపై ఎలాంటి అపోహలు వద్దన్నారు. టిడిపి ఎక్కడ ఉన్నా మైనార్టీల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అరాచక పాలనను సాగనంపి ప్రజా పాలన కావాలంటే ఎన్డీఏ ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని మైనార్టీలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పవన్ కుమార్ రెడ్డి, మైనార్టీ మత పెద్దలు, నియోజకవర్గం లోని ముస్లిములు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-కదిరి అర్బన్



సిఐ పుల్లయ్య

అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని పట్టణ సిఐ పుల్లయ్య హెచ్చరించారు. రద్దీ ప్రదేశాల్లో మహిళలు జాగ్రత్తగా ఉండాలని, నగలు కనపడకుండా వస్త్రాలతో దాచుకోవాలని సూచించారు. పట్టణంలో జరుగుతున్న ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నపిల్లలను కుటుంబ సభ్యుల వద్దే ఉంచుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సరైన ఆధారాలు లేకుండా నగదు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ఇప్పటికే జాతీయ రహదారి, చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్నామన్నారు. యువత సన్మార్గంలో నడిచి కుటుంబ సభ్యులకు మంచిపేరు తెచ్చి పెట్టాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాత్రి పట్టణంలో పోలీస్ నిఘా ఎక్కువ ఉంటుం దన్నారు. పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. యువత ద్విచక్ర వాహనం నడిపే విధా నం తెలుసుకొని, రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. రాజకీయ సభలు, సమావేశాలు, ప్రచారం, తదితర కార్యక్రమాలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రాత్రి వేళ జాతీయ రహదారి, ఇతర రహదారుల్లో ద్విచక్ర వాహనాలు వేగంగా నడపడం, కేకలు వేయడం లాంటి పనులు చేయకూడదని హెచ్చరించారు.

ఎన్నికల హామీలు 99 శాతం అమలు

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 99 శాతం అమలు చేసి ఏకైక సిఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో గురువారం 4వ వార్డు కౌన్సిలర్ జెసిబి రమణ ఆధ్వర్యంలో 150 కుటుంబాలు, 28వ వార్డు ఇన్‌ఛార్జి సరితాల బాషా ఆధ్వర్యంలో 172 కుటుంబాలు, ముదిగుబ్బకు చెందిన మాజీ ఎంపిటిసి నారాయణస్వామితో పాటు 8 మంది చేరారు. వారికి కేతిరెడ్డి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కేతిరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ. 3,200 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ.5వేల కోట్లు ఖర్చు చేసి ఆసుపత్రులు, విద్యాసంస్థలు, రహదారులు, తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. భవిష్యత్తులో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఎన్నికల్లో వైసిపిని ఆదిరంచాలని కోరారు. కేతిరెడ్డి సమక్షంలో జెసిబి రమణ ఆధ్వర్యంలో టిడిపికి చెందిన వెంకటేశ్, అశోక్, రామకృష్ణ, అతకాలప్ప, సుధాకర్, నారాయణనాయక్, పళ్లా ఆంజనేయులు, బాలు, ఈశ్వరయ్య, హరికృష్ణతో పాటు 150 కుటుంబాలు చేరాయి. సరితాల బాషా ఆధ్వర్యంలో దాసరి సత్యమయ్య, ఆంజనేయులు, పలవర మద్దిలేటి, శ్రీనివాస నాయక్, నీరుగంటి శ్రీరాములు, రంగయ్య, చీమల భాస్కర్, ఆంజనే యులు, రంగయ్యతో పాటు 172 కుటుంబాలు చేరాయి. ముదిగుబ్బ నారాయణ స్వామితో పాటు ఆదినారాయణ, కేశవయ్య, రామాంజనేయులు, క్రిష్ణ, చందు, దాస్‌నాయక్, రాములు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, పెణుజూరు నాగరాజు, నాయకులు రవి, అమీర్‌బాషా, సుబ్బారెడ్డి, మల్లేపల్లి సర్పంచి పాళ్యం క్రిష్ణ, దొరిగిల్లు చంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

30న విద్యుత్ అంతరాయం : డీఈ

కదిరి అర్బన్ : ఈ నెల 30వ తేదీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా పట్టణంలోని తిరువీధుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ మోజెస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి రథోత్సవం అనంతరం తేరు యథాస్థానానికి చేరుకునేంత వరకూ మధ్యాహ్నం 3 గంటల వరకూ నాలుగు తిరువీధులు, పూలబజారు, అయ్యప్ప స్వామి ఆలయం, ఏటిగడ్డ, వాసవీనగర్, నల్లగుట్ట, మారుతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

'పది' పరీక్షలకు 98 శాతం హాజరు

కొత్తచెరువు : జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన పదో తరగతి సాంస్క్రిట్ పరీక్షకు 98 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డిఇఒ మీనాక్షి, తెలిపారు. జిల్లావ్యాప్తంగా 35 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1,358 మందికి 1,334 మంది హాజరు కాగా 24మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీలు చేశారన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

బత్తలపల్లి : గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్ఐ గురువారం మండలంలోని గరిశలపల్లి గ్రామంలో సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం కార్డెన్ సెర్చ్ నిర్వహించి అనుమానితుల ఇళ్లు, రౌడీ షీటర్లు, మద్యం బెల్టు షాపుల్లో సోదాలు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు రక్షణగా ఉంటామని భరోసా ఇచ్చేందుకు పోలీసు బలగాలతో కవాతు నిర్వహించా మన్నారు. ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా ఓటు వేయవచ్చని తెలిపారు. గొడవలు, బెదిరింపులకు దిగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్రమైన చర్యలుం టాయని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు తిరుపాలు, సోమశేఖరమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యకాసం నాయకుడు మృతి



రమేష్(ఫైల్‌ఫొటో)



రమేష్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఎం, వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రమేష్(40) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ నెల 19వ తేదీన ఈయన ద్విచక్ర వాహనంలో వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం ఓరువాయి గ్రామానికి చెందిన రమేష్ సిపిఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘంలో జిల్లా కోశాధికారిగా ఉన్నాడు. ఈ నెల 19వ తేదీన ఆయన తన స్వగ్రామం నుంచి నల్లచెరువుకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తలకు తీవ్రంగా గాయం కావడంతో ఆయన్ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బెంగుళూరుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి మరణించాడు. రమేష్ భార్య కూడా మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఈయనకు 7,4వ తరగతి చదివే ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ మృతితో పిల్లలు ఇద్దరూ తల్లిదండ్రులు లేని వారయ్యారు. వృద్ధురాలు అయిన నాన్నమ్మ వద్దనే ప్రసుతం పిల్లలు ఉంటున్నారు. రమేష్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకు నిగా జిల్లాలో నిర్వహించిన పలు పోరాటాల్లో పాల్గొన్నారు. పేదలు, రైతు కూలీల కోసం చేసిన భూ స్వాధీనం ఉద్యమాల్లో ఆయన ముందుండి పోరాటం సాగించారు. పాత్రికేయునిగా కూడా పనిచేసి ప్రజా సమస్యలపై కథనాలను రాశాడు.

సిపిఎం, ప్రజాసంఘాల నేతల నివాళి

రమేష్ మృతి విషయం తెలుసుకున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ఆయనకు నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యకాసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, పెద్దన్న తదితరులు ఓరువాయి గ్రామానికి వెళ్లి రమేష్ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. గురువారం సాయంత్రం రమేష్ అంత్యక్రియలను కుటుంబ సభ్యులు స్వగ్రామం ఓరువాయిలో నిర్వహించారు.

వడదెబ్బపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : మండలంలోని జగరాజుపల్లి గ్రామంలో గురువారం పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది వడదెబ్బ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వడదెబ్బ లక్షణాలు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాలల్సిన జాగ్రతలపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. వీలైనంత వరకూ ప్రయాణాలు, పనులు కానీ ఉదయం 10 లోపు మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఉండేటట్లు చూచుకోవాలన్నారు. కాటన్ దుస్తులు ధరించాలని, ప్రయాణంలో చెప్పులు, గొడుగు, నీరు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. తరచూ నీరు, ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. అస్వస్థకు గురైతే వెంటనే సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి తెలిపారు. ప్రజలు పోషకాహా రం తీసుకొని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని సూచిం చారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్‌వైజర్ గోపి, ఎంఎల్ హెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్య కర్తలు రాజశేఖర్, ప్రమీల, ఆశా కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

మెళవాయి సర్పంచికి పలువురి పరామర్శ

మడకశిర : మండలంలోని మెళవాయి గ్రామ సర్పంచి రంగనాథ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రొళ్ల జడ్పిటిసి అనంతరాజు గురువారం రంగనాథ్ ఇంటికి వెళ్లి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సర్పంచులు మూర్తి, లక్ష్మీనారాయణ, నాయకులు జిల్లేడుగుంట మంజునాథ్, నరసింహారెడ్డి, మాలేగౌడ్ వెంకటేష్ ఉన్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి



చంద్రబాబుకు పూలబొకే అందజేస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

మడకశిర : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం రాప్తాడులో చేపట్టిన ప్రజా గళం కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి అభ్యర్థి సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అంతకుముందు హెలి ప్యాడ్ వద్ద సునీల్‌కుమార్ చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాం క్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో చంద్రబాబు చేపట్టిన ప్రజాగళం కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కెఎన్ పల్లి సురేష్, ఉగ్ర నరసింహప్ప, కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం పాండురంగప్ప, మారుతి ప్రసాద్ హాజరయ్యారు.

కదిరిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

నారా చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-కదిరి టౌన్

టిడిపి, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే కదిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హామీనిచ్చారు. ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా కదిరికి విచ్చేసిన ఆయన నియోజకవర్గం అభివృద్ధికి పలు హామీలు గుప్పించారు. గురువారం సాయంత్రం కదిరి పట్టణం ఎస్‌టిఎస్‌ఎన్ డిగ్రీ ప్రభుత్వ కళాశాల మైదానంకు సాయంత్రం 5-40గంటలకు చేరుకున్నారు. హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బికె.పార్థసారథి, కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్‌లు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ముస్లిం మైనారిటీలు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో చంద్రబాబు పాల్గొని మత పెద్దలు మైనార్టీలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడ నుంచి బయల్దేరి కాలేజ్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా రోడ్‌షోగా జ్యోతిరావు పూలే వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలా దగా చేశారన్నారు. వైసీపీ పాలనలో ఏ ఒక్కరూ స్వేచ్ఛగా బతికే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు రాష్ట్రాన్ని కేంద్రం బిందువుగా మార్చేసి యువతను డ్రగ్స్‌కు అలవాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి రాగానే రాయలసీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు.

కదిరికి వరాల జల్లు : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కదిరి ప్రజలకు వరాలజల్లు కురిపించారు. టీడీపీ, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి రాగానే తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణానికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలు డ్రెయినేజీ సమస్యతో ఇబ్బంది పడకుండా భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను తీసుకొస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పాలిటెక్నిక్ కాలేజ్ నుంచి రాయచోటి రోడ్డు మీదగా కౌలేపల్లి గేటు జాతీయ రహదారికి అనుసంధానం చేసి ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. రాయచోటి వయా నంబూలపూలకుంట, గార్లపెంట మండలాలకు రహదారి మంజూరు చేస్తామన్నారు. ఎన్‌పి.కుంట, గాండ్లపెంట మండలాలకు హంద్రీనీవా కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందిస్తామని తెలియజేశారు. కదిరి పట్టణంలో అసంబద్ధంగా నిలిచిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ పూర్తి చేస్తామని చెప్పారు. పట్టణంలో హిందూ శ్మశాన వాటిక లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు.



రోడ్‌షోలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

వాలంటీర్ల రాజీనామా

గాండ్లపెంట : మండలంలోని పలువురు గ్రామ వాలెంటీర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని వైసిపి మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు స్థానిక వైపిపి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం కోసం ఒక ఫీల్డ్ అసిస్టెంట్, ఇద్దరు వాలెంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ జగన్మోహన్, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్ ఫయాజ్ ఆలీ, మండల ఎస్‌సి సెల్ మేకల నరసింహులు, నాయకులు లక్ష్మి నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

ముదిగుబ్బ : మండలంలోని కొండగట్టుపల్లి , ఒడ్డు కింద తండా, తప్పెటవారిపల్లి, మల్లెపల్లి, దొరిగల్లు గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ నాగశేషాచలరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనల అమలు గురించి ఆరా తీశారు. గ్రామాల్లో నీటి సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

హిందూపురం : పట్టణంలోని 25, 25 వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ పథకాలపై టిడిపి నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రావు, రమేష్ కుమార్, కౌన్సిలర్ రాఘవేంద్ర, నాయకులు జెపికె రాము, శివ, జయసింహ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ ఉన్నాయ్ అంటూనే అలాగే ఉంచుకున్నారు..!

నాలుగు రోజులుగా స్టేషన్‌లోనే రూ. కోట్ల విలువజేసే బంగారు నగల వాహనం

అన్నీ సవ్యంగా ఉన్నాయంటూనే వాహనాన్ని వదలని అధికారులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీలలో ఈ నెల 25న కొడికొండ చెక్‌పోస్టు వద్ద భారీగా బంగారం నగలు తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు ఎన్నికల అదికారులు చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌కి తరలించారు.ఆ రోజు సాయంత్రం ఈ వాహనంలో ఉన్న నగలను తాము పరిశీలన చేయలేమని జిల్లా స్థాయి ట్రెజరీకి పంపిస్తాం అన్నారు. ఆ తర్వాత మంగళవారం ఆయా నగల షాపుల ప్రతినిధులను పిలిపించి వారి సమక్షంలో చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌లో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు, తహశీల్దార్, పోలీసులు సమక్షంలో నగలను,వారి వద్ద ఉన్న బిల్లులతో సరి చూశారు. దాదాపు 12 గంటల పాటు ఈ ప్రక్రియ జరిగింది. అయినా ఆ రోజు వాటి విలువను మీడియాకు వెల్లడించలేదు. తర్వాతి రోజు రూ. 22 కోట్లు అని నోటి మాటగా చెప్పుకొచ్చారు. అలాగే అన్నీ సవ్యంగా ఉన్నాయని అంటూనే వాహనాన్ని పంపకుండా పోలీస్ స్టేషన్ లోనే పెట్టుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పైగా దాదాపు రూ. 22 కోట్ల విలువచేసే నగలకు ప్రత్యేకమైన సాయుధ బలగాలతో భద్రత కల్పిస్తూ స్టేషన్‌లోనే ఎందుకు ఉంచారని అడిగితే పై అధికారుల ఆదేశాలు రావాలని చెప్పుకొస్తున్నారు. అయితే అన్నీ సవ్యంగా ఉంటే దాదాపు 4 రోజులు పాటు ఎందుకు ఉంచుకున్నట్లు అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్లరూపాయల విలువచేసే నగలు అదికారులు ఆపేస్తే దీనిపై ఆయా సంస్థలు ఎందుకు లీగల్ గా ముందుకు వెల్లలేదన్నది ప్రశ్నర్థకంగా ఉంది. బిల్లులలో ఏదైన తేడాలు ఉన్నా అధికారులు దానిని గుర్తించి బయటకు పొక్కకుండా, మీడియాకు వెల్లడించకుండా ఎందుకున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైన కోట్ల రూపాయల విలువచేసే బంగారు నగల వాహనాన్ని పట్టుకోవడం అన్నీ సవ్యంగా ఉన్నాయని చెబుతూనే వాహనాన్ని రిలీజ్ చేయక పోవడంపై మండలంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పోలీసుస్టేషన్‌లో ఉన్న బంగారునగలున్న వాహనం



బంగారు నగలు, బిల్లులను సరిచూస్తున్న అధికారులు

30లోగా ఎన్నికలపాసులకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్ : రానున్న సార్వత్రిక ఎన్నికలు, 2024 కు పోలింగ్ ప్రక్రియ, కౌంటింగ్ కవరేజ్ కోసం పాత్రికేయులు ఈనెల 30 తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పౌర సంబంధాల అధికారి వేలాయుధం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ప్రింట్ మీడియా నుండి ఒక రిపోర్టర్, ఒక ఫోటోగ్రాఫర్, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి ఒక కెమెరామెన్, ఒక రిపోర్టర్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ప్రింట్ మీడియా నుండి ఒక రిపోర్టర్, ఫోటోగ్రాఫర్ ఒకరు, ఎలక్ట్రానిక్ మీడియా నుండి వీడియో కెమెరామెన్ ఒకరు, రిపోర్టర్ ఒకరు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అక్రిడేషన్ కలిగిన ఆయా సంస్థల అథారిటీ లెటర్లను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించిన ప్రక్రియలో పాల్గొనేవారు అథారిటీ లెటర్లు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు మార్చి 30 వ తేదీ లోపల పుట్టపర్తిలోని డిపిఆర్ఒకు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

ప్రజాభిప్రాయం మేరకు నడుచుకుంటాం : చిలకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న 'చిలకం'

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల అభిప్రాయాల మేరకు తాము నడుచుకుంటామనిజనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మవరంలో వైసీపీ అరాచకాలను, దౌర్జన్యాలను, దాడులను ఐదేళ్లగా ఎదుర్కొన్నామన్నారు. ఇందులో భాగంగా సేవ్ ధర్మవరం కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లి అనేక హామీలిచ్చామన్నారు. వాటిని నెరవేర్చలేకపోతున్నందుకు ధర్మవరం ప్రజలు తమను క్షమించాలన్నారు. అదేవిధంగా మిత్రపక్ష అభ్యర్థిగా సత్యకుమార్‌యాదవ్‌ను నియమించినందుకు వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేసుకుని కార్యాచరణతో ప్రజల ముందుకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకుని వాటిని జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అదేవిధంగా సత్యకుమార్‌యాదవ్‌కు కూడా తెలియజేస్తానన్నారు. తమ అధినేత పవన్‌కళ్యాణ్ నిర్ణయం మేరకు తమ నిర్ణయాన్ని తెలియజేస్తామన్నారు.గత 20 ఏళ్ల నుంచి ప్రతిసారి అభ్యర్థి విషయంలో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ధర్మవరాన్ని కాపాడుకోవాలని కంకణం కట్టుకున్నామని కానీ కొందరి ఆలోచనల వల్ల పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌ను ప్రకటించారని అన్నారు. ధర్మవరం పరిస్థితుల గురించి సత్య కుమార్ యాదవ్ తో మాట్లాడుతానన్నారు. ఆయన ఎన్నికలలో విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం



ఎన్నికల ప్రచారంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి -బత్తలపల్లి

వైసిపితోనే సంక్షేమం సాధ్యమనిధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు.

కూటమిని నమ్మొద్దు : ఎలాగైనా అధికారంలోకి రావడానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూటమిని ఏర్పాటు చేసుకొని మోసపూరిత హామీలతో మరోసారి ప్రజల ముందుకు వస్తున్నారని గత అనుభవాలను ప్రజలు మరిచిపోవద్దని సూచించారు. ఆ పార్టీని నమ్మితే రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డితో పాటు స్థానిక నాయకులు వెంకటరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : సంక్షేమం, అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని కదిరి మున్సిపల్ కౌన్సిలర్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక 28, 33 వార్డులలో కౌన్సిలర్ దాదాపీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, కిన్నెర కళ్యాణ్, బండారు మురళి, ఉట్టి ఓం ప్రకాష్, బొబ్బలి రవి, వలీ, షాను, పిచ్చిలి శంకర్, కుర్లి శివారెడ్డి, బాబ్జాన్, చెన్నూర్ గంగాధర్, రియాజ్, మహబూబ్, నాగార్జున, ఈశ్వరరెడ్డి, కుటాగుల సలీమ్, పూల మండీ రవి, బాబు నాయక్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో వైసిపి అభ్యర్థి మక్బూల్

ఇఫ్తార్‌లో పాల్గొనే అర్హత చంద్రబాబుకు లేదు

కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఏనాడు మైనారిటీలను గుర్తించని చంద్రబాబుకు ఇఫ్తార్‌లో పాల్గొనే అర్హత లేదనికదిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బుల్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం రూరల్ మండల పరిధిలోని పట్నం పంచాయతీ ఏటిగడ్డ తండా, వీరేపల్లి పేట, రాచవారి పల్లి తండాలలో ఆ పార్టీ నాయకులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి పాటుపడే వైసిపిని ఆదరించాలని కోరారు. పదవుల ఆశ చూపి పార్టీలో చేర్చుకుని కదిరి మైనారిటీ నాయకుడిని నట్టేట ముంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, జడ్పిటిసి భూక్యా రాధాకృష్ణ నాయక్, మండల కన్వీనర్ ప్రకాష్, సర్పంచి చలపతి నాయక్, ఎంపీటీసీ ఆనంద్ నాయక్, జిల్లా అగ్రికల్చర్ బోర్డు మెంబర్ సుధీర్ రెడ్డి, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర భవిష్యత్తు కోసం తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామనిమాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని బడే నాయక్ తండా, గోనే నాయక్ తండాలను ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డిని ఆదరించాలని కోరారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, బీడుపల్లి టిడిపి కౌన్సిలర్ జయప్ప, నాయకులు శంకర్, మనోహర్ బాల, జయరాం నాయక్, అంబులెన్స్ రమేష్, బేకరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పల్లె రఘునాథరెడ్డి

బుక్కపట్నం :మండంలోని కృష్ణాపురం, మారాల, యాద లంకపల్లికి చెందిన టిడిపి నాయకులతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమావేశం నిర్వహించారు. గురువారం పుట్టపర్తిలోని తన కార్యాలయంలో మండలంలోని బూత్ కన్వీనర్లు, కృష్ణాపురం, మారాల, యాదలంకపల్లికి చెందిన నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పల్లె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పుట్టపర్తి నియోజకవర్గం లో టిడిపి జెండా ఎగరవేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మలిరెడ్డి, నాయకులు గోపాలపురం గంగాధర్, పల్లపు రవీంద్ర, నారాయణస్వామి, లింగప్ప గారి పల్లి రవి, ఆంజనేయులు, కిష్టప్ప, హరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కిడ్నాప్ కేసులో నిందితులు అరెస్టు

కొత్తచెరువు : .ఈనెల 24న చికెన్ సెంటర్ నిర్వాహకుడు ఉప్పు వెంకటాచలపతిని కిడ్నాప్ కేసులోని నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, కొత్తచెరువు సిఐ రాజా రమేష్ తెలిపారు కొత్తచెరువు పోలీస్ స్టేషన్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు వివరాలు వెల్లడించారు. వెంకటాచలపతికి వరుసకు బామర్ది అయినా పెనుగొండకు చెందిన మైలాపురం భానుచంద్ర అలియాస్ భాను, పెనుగొండలో పంచర్ షాపులు నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. తన అవసరార్థం డబ్బులు ఇవ్వాలని బావను డిమాండ్ చేశాడని అందుకు ఆయన అంగీకరించకపోవటంతో పథకం ప్రకారం ఈ కిడ్నాప్ కు పాల్పడ్డారన్నారు. ఈయనతోపాటు సికేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన శ్రావణ్, రొద్దం మండలం బసంపల్లి గ్రామానికి చెందిన సూరి,కడప జిల్లాకు చెందిన రిషికేశవరెడ్డి, విష్ణువర్ధన్, కందుకూరి శివ కిషోర్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, ఇరగమ్ రెడ్డి గంగాధర్ రెడ్డి కలిసి ఈనెల 24న తెల్లవారుజామున చికెన్ సెంటర్ వద్దకు వస్తుండగా బలవంతంగా కారులో వేసుకొని ముదిగుబ్బ వైపు వెళ్లారన్నారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో ఎస్పీ సూచనల మేరకు ముదిగుబ్బ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అందులో ముగ్గురు నిందితులు పరారయ్యారన్నారు. వారితోపాటు ఒక కారు, ఒక ప్లాస్టర్, 8 సెల్ ఫోన్లు, 18 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరు పర్చుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పోలీసుల. జీవన నాయక్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

లేపాక్షి : ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ జ్యోతి ఆధ్వర్యంలో గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్నాటక మద్యం పట్టుబడింది. పశ్చిమ బెంగాల్‌కి చెందిన హరినాథన్‌ఘోష్ బెంగళూరు నుంచి కారులో మద్యం తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ తహశీల్దార్ జ్యోతి తెలిపారు. మద్యం విలువ రూ. 7,500 ఉంటుందన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

'చిలకం'పై నమోదైన కేసు కొట్టివేత

ధర్మవరం టౌన్ : 2019లో పవన్‌కల్యాణ్ పర్యటనలో భాగంగా రోడ్లపై మైకులు ఏర్పాటుచేశారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిపై నమోదైన కేసును కొట్టివేసినట్టు పోలీసులు తెలిపారు. 2019లో పవన్ కల్యాణ్ ధర్మవరం వచ్చినప్పుడు మైకులు ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు కల్గించారని అప్పట్లో పోలీసులు చిలకం మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఐదేళ్లపాటు కోర్టులో విచారణ జరుగుతోంది.ఈ క్రమంలో గురువారం ధర్మవరం సీనియర్ సివిల్ కోర్టులో ఆ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చినట్టు పోలీసులు తెలిపారు. ఈమేరకు 2019లో తనపై అక్రమంగా కేసు నమోదు చేశారని, కోర్టు నిజానిజాలు తెలుసుకుని కేసును కొట్టివేసిందని చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు.

శ్రీవారిసేవలో ఎమ్మెల్యే దంపతులు

కదిరి అర్బన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన మోహిని ఉత్సవంలో శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్దారెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ ఉషారాణి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల ఓటర్ల వివరాలు సేకరించండి

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా 38 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న వృద్ధుల ఓటర్ల వివరాలను బిఎల్‌ఒలు సేకరించాలని తహశీల్దార్ కళావతి తెలిపారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 85 సంవత్సరాల పైబడిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపిందని కావున గ్రామాల్లో వారి వివరాలను సేకరించాలని చెప్పారు. అలాగే నూతనంగా ఓటర్ లిస్టులో పేర్లు చేర్చుకోవడానికి, చేర్పులు, మార్పులకు సమయం ఏప్రిల్ 13వ తేదీ వరకు పొడగించారని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, వీఆర్వోలు వేణు, శ్రీనివాసులు, బిఎల్‌ఒలు శివప్రసాద్, గంగాధర్, సాయి, తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ ఉద్యోగుల నూతన సంఘం ఏర్పాటు

పుట్టపర్తి క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్నిఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ సర్కిల్ వద్ద ఉన్న షాదీ మహల్‌లో జిల్లాలోని ఉద్యోగ సంఘం నాయకులు సమావేశమై జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బివి. భాస్కర్ రెడ్డి, కార్యదర్శిగా జి. మహేశ్వర్ రెడ్డి, కోశాధికారిగా కెవి. నారాయణరెడ్డి, సభ్యులుగా నాగేంద్ర నాయక్, సుదర్శన్ రాజు, చెన్నారెడ్డి, విశ్వతేజ, శ్రీనివాసులు, శ్రీదేవి తదితరులను నూతన జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి తోటి ఉద్యోగులు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ హోదాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రమాద జీవిత బీమాతో భరోసా

హిందూపురం : పోస్టాఫీసులో అందుబాటులో ఉన్నా ప్రమాద జీవిత బీమాతో ప్రతి కుటుంబానికి భరోసా లభిస్తుందని చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ మేనేజర్ ప్రకాష్ అన్నారు. పట్టణంలోని మోడల్ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ ఇస్మాయిల్ భార్య ముబషిర పోస్టాఫీసులో అందుబాటులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద గత సంవత్సరం సెప్టెంబర్ 30న రూ.330 జమ చేసింది. గత సంవత్సరం నవంబర్ నెల 25న షేక్ ఇస్మాయిల్ సాధారణ మృతిచెందాడు. ఈ పథకం కింద జమ చేసిన వారికి రూ.2లక్షలు క్లెయిమ్ మంజూరు అయింది. ఆ చెక్కును గురువారం ప్రధాన తపాలా కార్యాలయంలో మృతుడి భార్య ముబషిరకు చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ మేనేజర్ ప్రకాష్ అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్టుమాస్టర్ మార్కండేయ, ఎఎస్ పి కళ్యాణ్ రామ్,అసిస్టెంట్ పోస్టుమాస్టర్ రహమతుల్లా, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా మార్చి నెలాఖరు లోగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ రాయితీని పొందాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతు పన్నుల వసూలుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 1, 2024 నుండి పన్ను పై వడ్డీ యధావిధిగా జమ అవుతుందన్నారు. శుక్రవారం, ఆదివారం సైతం మున్సిపల్ కార్యలయంలో ప్రత్యేక క్యాష్ కౌంటర్లను ఉదయం 9 నుండి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తాయని అన్నారు. దీంతో పాటు మేళాపురం, లక్ష్మీపురం, టీచర్స్ కాలనీల్లోని సచివాలయాల్లో సైతం కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

పోలింగ్‌కేంద్రాల పరిశీలన

హిందూపురం : పట్టణంలోని ఎంజీఎం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ తో పాటు రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి అభిషేక్ కుమార్ స్థానిక అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఓటర్లకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ఇఒఆర్‌డి నటరాజన్‌ను ఆదేశించారు. అనంతరం ఎంజీఎం మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డి, డి ఎస్ పి కంజాక్షన్, వన్ టౌన్ సిఐ శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గరుడ సేవలో శ్రీవారు

కదిరి అర్బన్ : ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవారు గురువారం ప్రజా గరుడ సేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తిరువీధులలో స్వామిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు, కళాకారులు, విద్వాంసులు ఉన్నారు.

